

కార్తీక శోభ



శివ క్షేత్రాలు కార్తీక శోభను సంతరించుకున్నాయి. ఆలయాలన్నీ ఈ నెల రోజులూ పూజలు, అభిషేకాలు, ధూపదీపాలతో అలరారనున్నాయి. భక్తుల పూజలకు అనువుగా కమిటీలు ఏర్పాట్లు చేశాయి. సోమవారాల్లో ప్రత్యేక పూజలు జరుగనున్నాయి.

6 లో

తీరం.. కలవరం





వేటకు వెళ్లి వచ్చే మత్స్యకారులతో సందడిగా కనిపించే ఆ గ్రామాల్లో కలవరం నెలకొంది. బుధవారం రోజంతా నిశ్శబ్దం అలముకుంది. వేటకు వెళ్లిన ఎనిమిది మంది జిల్లా మత్స్యకారులు బంగ్లాదేశ్ కోస్టుగార్డుకు చిక్కిన సమాచారం తెలిశాక మత్స్యకార గ్రామాలన్నీ ఆవేదనకు లోనయ్యాయి. వారి క్షేమ సమాచారం కోసం వారంతా నిరీక్షిస్తున్నారు. నాయకులకు ఫోన్ చేసి తమ వారిని క్షేమంగా ఇంటికి తీసుకురావాలని కోరుతున్నారు. వారి కుటుంబ సభ్యులు మరింత ఆత్రంతో ఎదురుచూస్తున్నారు.

- బంగ్లాదేశ్ కోస్టుగార్డ్ ఆధీనంలో 8 మంది జిల్లా మత్స్యకారులు
- వేటాడుతూ పొరపాటున చిక్కన వైనం
- ఆందోళనలో వారి కుటుంబాలు
- ప్రభుత్వానికి విన్నపాలు
- క్షేమంగా తీసుకువస్తామన్న కలెక్టర్

విజయనగరం/భోగాపురం/పూసపాటిరేగ, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి)

భోగాపురం మండలం కొండ్రాజు పాలెంకు చెందిన మరుపల్లి చిన్నఅప్పన్న, మరుపల్లి రమేష్, సూరాడ అప్పలకొండ, మరుపల్లి ప్రవీణ్, సురపతి రాము, ఎం. చిన్నఅప్పన్న, పూసపాటిరేగ మండలం తిప్పలవలసకు చెందిన నక్కా రాము, వాసపల్లి సీతయ్యలు విశాఖపట్నంలోని జాలరుపేటలో తాత్కాలికంగా నివాసముంటున్నారు. ఈ 8 మంది మత్స్యకారులు వడ్డాది సత్యనారాయణకు చెందిన పడవపై ఈనెల 13న విశాఖ హార్బర్ నుంచి చేపల వేటకు బయలుదేరారు. సముద్రంలో వేట సాగిస్తూ సిగ్నల్స్ అందకో.. వాతావరణం అనుకూలించకో బుధవారం వేకువజామున సుమారు 2 గంటల సమయంలో సముద్రంలో బంగ్లాదేశ్ సరిహద్దు దాటేశారు. దీనిని గుర్తించిన బంగ్లాదేశ్ కోస్టుగార్డు సిబ్బంది పడవతో పాటు 8 మంది మత్స్యకారులను అదుపులోకి తీసుకొన్నారు. అంతకు కొద్దిక్షణాల ముందు పడవలో ఉన్న మత్స్య కారులు వాకీటాకీ ద్వారా సముద్రంలో దూరంగా వేట సాగిస్తున్న తమ సహచరులకు తాము బంగ్లాదేశ్‌కు చిక్కిన (మిగతా 8వ పేజీలో..)

ప్రతి అర్జీని పరిష్కరించాలి — కలెక్టర్ రామసుందర్‌రెడ్డి 7

శివమాల ధారణం... నియమాల తోరణం 6

మూణ్నాళ్ల ముచ్చటే — ● ఐదు నెలలకే ముషిడిపల్లి- కృష్ణాపురం బీటీ రోడ్డు గోతులమయం ● మళ్లీ అగచాట్లు తప్పడం లేదంటున్న వాహనచోదకులు 7

అంకుళ్ల వలసలో ఏనుగులు 6 — ● పొలాల్లో స్వైర విహారం

గిరిజన గ్రామాలకు రహదారులు 6 — ● మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

అందరి సహకారంతో ఉత్సవాలు విజయవంతం 6 — ● కలెక్టర్ రామసుందర్‌రెడ్డి

కన్వర్షన్ లేదు సరే.. పర్మిషనో!



చీపురుపల్లి: ల్యాండ్ కన్వర్షన్ లేకుండా చిననడిపల్లిలో వేసిన లే అవుట్

వ్యవసాయ భూముల్లో లే అవుట్లు వేసే వారు భూ మార్పిడి చేయాల్సిన అవసరం లేదంటూ ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్స్‌తో రియల్టర్ల పంట పండింది. ఈ ఆర్డినెన్స్ జారీ అయిన తరువాత రియల్ ఎస్టేట్ వ్యాపారులు జోరు పెంచారు. విరివిగా భూ విక్రయాలు జరిపే పనిలో పడ్డారు. ప్లాట్లు వేసేందుకు పెద్ద ఎత్తున భూములను సేకరిస్తున్నారు. ఇదే సమయంలో ఇతర సంస్థల నుంచి తప్పనిసరిగా అనుమతులు పొందాలన్న నిబంధనను విస్మరిస్తున్నారు. అటువంటి వారిని గుర్తించడం అధికారులకు తలనొప్పిగా తయారైంది.

- ల్యాండ్ కన్వర్షన్ లేకుండానే లేఅవుట్‌లు
- ఆర్డినెన్స్ జారీ చేసిన ప్రభుత్వం
- ఇదే అదనుగా జోరందుకున్న రియల్ వ్యాపారం
- ఇతర సంస్థల అనుమతులను పట్టించుకోని వైనం

చీపురుపల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి):

రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలనుకున్న వారు ముందుగా భూములను వ్యవసాయేతర భూమిగా మార్పు చేయాలన్న నిబంధన గతంలో ఉండేది. ల్యాండ్ కన్వర్షన్ అయిన భూముల్లో మాత్రమే లే అవుట్లు వేయాల్సి ఉంది. కన్వర్షన్ అయిన తరువాత వీఎంఆర్డీఏ, డీటీసీపీ వంటి సంస్థల నుంచి ముఖ్యమైన అనుమతులు కూడా పొందాల్సి ఉంది. అయితే వీఎంఆర్డీఏ, డీటీసీపీ వంటి సంస్థల అనుమతులు తప్పనిసరి చేసిన క్రమంలో ల్యాండ్ కన్వర్షన్ అవసరం ఏముందని భావించిన ప్రభుత్వం రద్దు చేస్తూ గత నెలలో ఆర్డినెన్స్ జారీ చేసింది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల వ్యాపారుల పంట పండినట్టయ్యింది.

గతంలో వ్యాపారులు లే అవుట్ వేసే భూములకు సంబంధించి ల్యాండ్ కన్వర్షన్ రుసుం మాత్రమే చెల్లించి మిగిలిన అనుమతులు లేకుండా ధైర్యంగా లే అవుట్లు వేసి విక్రయాలు సాగించేవారు. కొనుగోలుదారులకు ల్యాండ్ కన్వర్షన్ అయినట్టు సంబంధిత రెవెన్యూ డివిజన్ అధికారులు జారీ చేసిన ఉత్తర్వులను మాత్రమే చూపించేవారు. కన్వర్షన్ అయితే చాలని, ఇతర అనుమతులు లేకపోయినా సమస్య కాదని(మిగతా 8వ పేజీలో..)

అనుమతి లేకుంటే చర్యలు తప్పవు

ల్యాండ్ కన్వర్షన్ విధానాన్ని రద్దు చేసిన మాట వాస్తవమే. అయితే వీఎంఆర్డీఏ, డీటీసీపీ వంటి సంస్థల అనుమతులు తప్పనిసరి. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకునే ప్రభుత్వం ల్యాండ్ కన్వర్షన్ విధానాన్ని రద్దు చేసింది. ఇదే అదునుగా ఇతర అనుమతులు పొందకుండా లే అవుట్లు వేస్తే చట్టపరమైన చర్యలు తప్పవు. అటువంటి లే అవుట్లను రద్దు చేస్తాం.

- ఐ.సురేష్, ఎంపీడీవో, చీపురుపల్లి

వైభవంగా చండీయాగం

- వనంగుడికి అమ్మవారి రాక
- ముగిసిన పైడిమాంబ దీక్షలు



చండీయాగం

విజయనగరం రూరల్/కల్చరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పైడిమాంబ వనంగుడి వద్ద బుధవారం చండీయాగం వైభవంగా జరిగింది. ఆనవాయితీ ప్రకారం ఉయ్యాల కంబాల ప్రక్రియ అనంతరం పైడిమాంబను వనంగుడికి తీసుకొస్తారు. దీక్షాదారులు, దేవస్థానం అధికారులు, పాలకమండలి సభ్యులు కలిసి పైడిమాంబ ఉత్సవ విగ్రహాన్ని చదురుగుడి నుంచి భారీ ఊరేగింపుతో బుధవారం వనంగుడికి తీసుకొచ్చారు. అనంతరం దేవదాయశాఖ సహాయ కమిషనర్ కె.శిరీషా, ఆలయ ప్రధాన పూజారి బంటుపల్లి వెంకటరావు సమక్షంలో మహా చండీయాగాన్ని వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు చండీయాగంలో పాల్గొన్నారు. అమ్మవారి దీక్షాదారులు హోమం అనంతరం దీక్షను విరమించారు. చండీయాగం పురస్కరించుకుని వనంగుడిలో పైడిమాంబను ప్రత్యేకంగా అలంకరించారు.



పురవీధుల్లో భక్తుల ఊరేగింపు

నిలిచిన ఎన్టీఆర్ వైద్య సేవ



- జిల్లాలో 19 ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆగిన సేవలు
- రోగులకు తప్పని ఇబ్బందులు



రాజాం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి)

జిల్లా వ్యాప్తంగా ఎన్టీఆర్ వైద్య సేవ కింద అందిస్తున్న సేవలు నిలిచిపోయాయి. బిల్లుల బకాయిలు చెల్లించాలని కోరుతూ నెట్‌వర్క్ యాజమాన్య ఆస్పత్రులు సమ్మె బాట పట్టడంతో సేవలన్నీ ఆగిపోయాయి. రాష్ట్ర వ్యాప్తంగా రూ.2,700 కోట్లు బకాయిలు ఉండగా ఉమ్మడి జిల్లాకు సంబంధించి రూ.200 కోట్లు వరకూ పెండింగ్‌లో ఉన్నట్టు తెలుస్తోంది. వాటిని చెల్లిస్తే కానీ సేవలు అందించలేమని ప్రైవేటు నెట్‌వర్క్ ఆస్పత్రులు తేల్చిచెప్పడంతో పేదలకు వైద్యం అందడం లేదు.

జిల్లాలో 28 వరకూ ఎన్టీఆర్ వైద్య సేవ నెట్‌వర్క్ ఆస్పత్రులున్నాయి. వీటిలో తొమ్మిది ప్రభుత్వ ఆస్పత్రులుకాగా మిగతా 19 ప్రైవేటు ఆస్పత్రులు. ప్రస్తుతం ప్రైవేటు నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో సేవలు అందడం లేదు. రాజాం, గజపతినగరం ప్రాంతీయ ఆస్పత్రులు, ఎస్.కోట ఏరియా ఆస్పత్రి, బాడంగి, బొబ్బిలి, చీపురుపల్లి, నెల్లిమర్ల సీహెచ్‌సీలు, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, ఘోషాస్పత్రిలో ఎన్టీఆర్ వైద్య సేవ సేవలు అందుతున్నాయి. ప్రైవేటు ఆస్పత్రులతో పోల్చుకుంటే ప్రభుత్వ ఆస్పత్రుల్లో పరికరాలు, వసతులు తక్కువ. అందుకే రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఎన్టీఆర్ వైద్య సేవ సర్వీసులు నిలిపివేయనున్నట్లు గత నెల 10 నుంచి నెట్‌వర్క్ ఆస్పత్రుల సంఘం ప్రభుత్వానికి స్పష్టం చేసింది. అప్పటి నుంచి క్రమేపీ ఒక్కో సేవను ఆపేస్తూ వచ్చాయి.

వైసీపీ హయాం నుంచే బకాయిలు

బిల్లుల పెండింగ్ వైసీపీ (మిగతా 8వ పేజీలో..)


ఉత్తమ శిక్షణ అందించాలి: ఎస్పీ

విజయనగరం క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సారిపల్లి కేంద్రంలో ట్రైనింగ్ పొందుతున్న కానిస్టేబుళ్లకు ఉత్తమ శిక్షణ అందించాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశించారు. నూతనంగా ఎంపికైన వారికి అందుతున్న సౌకర్యాలు, ఇతర పరిస్థితులను పరిశీలించేందుకు బుధవారం సారిపల్లి కేంద్రాన్ని సందర్శించారు. తరగతి గదులు, వంట, మరుగుదొడ్లు, క్రీడా ప్రాంగణం, ఫైరింగు రేంజ్, వాటర్ ప్లాంట్, డైనింగు హాల్, కంప్యూటర్ ల్యాబ్‌ను స్వయంగా పరిశీలించి మౌలిక వసతులు పూర్తిస్థాయిలో ఉండాలన్నారు. పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడాలని సూచించారు. కొత్త కానిస్టేబుళ్లలో విధుల పట్ల నిబద్ధత, క్రమశిక్షణ, అంకితభావం కలిగేలా శిక్షణ ఇవ్వాలన్నారు. ఎస్పీ వెంట ఏఎస్పీ సౌమ్యలత, డీటీసీ డీఎస్పీ వీరకుమార్, సీఐలు లలిత, చంద్రశేఖర్, శ్రీనివాసరెడ్డి, ఆర్ఐ గోపాలనాయుడు ఉన్నారు.



పరిసరాలను తనిఖీ చేస్తున్న ఎస్పీ

బినామీ మస్తర్లకు చెక్



- ఉపాధి కూలీలకు ఈకేవైసీ
- త్వరలోనే ముఖ హాజరు అమలు
- అక్రమాలు, అవినీతిపై అస్త్రం

మెంటాడ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి):

జిల్లాలో అనేక గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనుల్లో అవకతవకలు జరుగుతున్నాయి. అక్రమాలు నిత్యకృత్యమైపోయాయి. పథకం ఉద్దేశాన్ని, ఆశయాన్ని నీరుగార్చుతున్న బినామీ మస్తర్లపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా దృష్టి సారించాయి. దొంగ మస్తర్లకు పూర్తిగా చెక్ పెట్టేదిశగా చర్యలు ప్రారంభించాయి. అక్రమాలు, అవినీతిపై ఈకేవైసీ అస్త్రాన్ని ప్రయోగించాలని నిర్ణయించాయి. అనంతరం ఉపాధి వేతనదారులకు ముఖ గుర్తింపు హాజరును అమలు చేయనున్నాయి. ఉపాధి హామీ పథకాన్ని పారదర్శకంగా అమలుచేసేందుకు ప్రభుత్వాలు ఎన్ని చర్యలు చేపడుతున్నా క్షేత్రస్థాయి సిబ్బంది చేతివాటం పుణ్యమాని దొంగ మస్తర్లు, బినామీ మస్తర్లు కట్టడి కష్టసాధ్యమవుతోంది. భారీఎత్తున జరుగుతున్న నిధులు కేటాయింపునకు తగ్గ ఫలితాలు కనిపించక పోవడంతో కేంద్ర ప్రభుత్వం తరచూ సంస్కరణలు తెస్తోంది. అయినా ఇంటిదొంగల కారణంగా అవి నిరర్థకమవుతున్నాయి. దీంతో చివరి అస్త్రంగా ఈకేవైసీని ప్రయోగిస్తోంది. ఇందుకోసం (మిగతా 8వ పేజీలో..)

- మెంటాడ మండలంలోని చింతాడవలస గ్రామానికి చెందిన టి.పైడితల్లమ్మ, చింత సింహాచలం మరణించిన తరువాత ఉపాధి పనికి వెళ్లినట్లు ఉపాధి సిబ్బంది దొంగ మస్తర్లు వేశారు. కొన్నాళ్లకు విషయం బయటపడింది. ఏపీడీ స్థాయి అధికారులు గ్రామంలో విచారించి వాస్తవమని తేల్చారు. ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలకు ఆదేశించారు.
- మెంటాడ మండలంలోని పిట్టాడ గ్రామంలో కుచ్చు చంద్రునాయుడు విశాఖ డెయిరీ సెక్రటరీగా పనిచేస్తున్నారు. నేటివరకు ఉపాధి పని గురించి ఆయనకు తెలియదు. అయినా స్థానిక ఫీల్డ్ అసిస్టెంట్ ఆయన పేరున దొంగ మస్తర్లు వేసి సొమ్ము చేసుకున్నట్లు ఫిర్యాదు రావడంతో అధికారులు విచారించారు. చర్యలకు ఉపక్రమిస్తున్న క్రమంలో ఆయనే ఉద్యోగానికి రాజీనామా చేశాడు.

● శివాలయాల్లో ప్రత్యేక పూజలు ప్రారంభం

కార్తీక శోభ


సాలూరు వేంకటేశ్వర కాలనీలోని శివాలయం



శివాలయాలకు కార్తీక కళ వచ్చింది. బుధవారం నుంచి కార్తీక మాసం ప్రారంభమైంది. దీంతో శివాలయాలకు భక్తులు క్యూ కడుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ శివాలయాల్లో భక్తుల పూజలకు అనువుగా కమిటీలు ఏర్పాట్లు చేశాయి. కార్తీకంలో నెల రోజుల పాటు శివాలయాలను భక్తులు దర్శించుకుంటారు. సోమవారాల్లో ప్రత్యేక పూజలు చేస్తారు. ఈ నేపథ్యంలో ఎక్కడికక్కడ సౌకర్యాలు కల్పించారు.

సాలూరు రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కార్తీక పూజలతో శివాలయాలకు కొత్త కళ వచ్చింది. పార్వతీపురం మన్యం జిల్లాలో అడ్డాపుశీల, సాలూరులోని పంచ ముఖేశ్వర ఆలయం, పాచిపెంట మండలంలోని మంచాడ వలస గోకర్ణేశ్వర గుహాలయం తదితర చోట్ల కార్తీక పూజలు ప్రారంభమయ్యాయి. కార్తీకమాసం శివుడితో పాటు విష్ణువుకూ ప్రీతిపాత్రమైనదని భక్తుల విశ్వాసం. ఈ మాసంలో నెల రోజుల పాటు భక్తులు శివదర్శనం చేసుకుంటారు. బ్రహ్మ ముహూర్తంలో నదీ స్నానమాచరిస్తారు. వీటిని దృష్టిలో పెట్టుకొని ఆలయాల నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. సాలూరులోని పురాతన పంచముఖేశ్వర ఆలయంలో సోమవారాల్లో భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. మక్కువ మండలంలో ఉన్న శాంతీశ్వర, ముక్కాలయవలస శివాలయాల్లో భక్తుల దర్శనానికి ఏర్పాట్లు చేశారు. నవంబరు 2న కార్తీక శుద్ధ ఏకాదశి, 5న కార్తీక పూర్ణిమ సందర్భంగా గౌరీ పూజలను చేయనున్నారు.

అడ్డాపుశీలలో..


కాశీవిశ్వేశ్వర ఆలయం వద్ద ఉన్న మహానంది

పార్వతీపురం రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అడ్డాపుశీల గ్రామం వద్ద ఉన్న కాశీవిశ్వేశ్వర ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. కోర్కెలు తీర్చే స్వామిగా కాశీవిశ్వేశ్వరుడికి పేరుంది. కార్తీక మాసంలో పార్వతీపురం, పాలకొండ, జియ్యమ్మవలస, ఒడిశా తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున ఇక్కడికి వస్తుంటారు. కమిటీ ఆధ్వర్యంలో ఆలయ సమీపంలో మహానందిని ఏర్పాటు చేశారు. ఆలయ ప్రాంగణంలో లక్ష్మీదేవి తదితర ఆలయాలు ఉన్నాయి.

సంగాంలో...


సంగమేశ్వర ఆలయం

వంగర, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సంగాంలో వెలసిన పురాతన సంగమేశ్వర స్వామి ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారు. సాక్షాత్తూ బలరాముడు నిర్మించిన ఆలయంగా దీని గురించి చెబుతారు. ఈ ఆలయం నాగావళి, వేగావతి, సువర్ణముఖి నదులు కలిసే ప్రాంతంలో ఉండటం విశేషం. సంగమేశ్వరుడిని దర్శించుకుంటే కాశీ క్షేత్రానికి వెళ్లినంత పుణ్యం లభిస్తుందని భక్తుల విశ్వాసం. కార్తీకమాసం సందర్భంగా నెలరోజులపాటు ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేస్తారు. త్రివేణి సంగమ ప్రాంతంలో స్నానాలాచరించి.. అనంతరం స్వామిని దర్శించుకుంటారు. కార్తీక సోమవారాల్లో అన్న సమారాధన చేయనున్నట్టు ఆలయ చైర్మన్ బి.ఆనందరావు తెలిపారు.

కుంబిడి ఇచ్ఛాపురంలో...


ఉమామహేశ్వర ఆలయంలోని శివలింగం

వీరఘట్టం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కుంబిడి ఇచ్ఛాపురం గ్రామంలోని ఉమామహేశ్వర ఆలయం చుట్టూ కొండలు... పచ్చని పంట పొలాల నడుమ ఉంది. ఇది స్వయంభూ శివ లింగమని భక్తులు చెబుతారు. మూడో సోమవారం శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాతో పాటు ఒడిశా నుంచి కూడా వేలాది మంది భక్తులు వస్తారు. ఈ ఆలయ పరిసరాల్లో దాతలు వినాయక, పార్వతీదేవి, సుబ్రహ్మణ్యేశ్వర ఆలయాలను నిర్మించారు. దర్శనానికి వెళ్లేందుకు షెల్టర్‌ను ఏర్పాటు చేశారు.

గుంప ఆలయానికి దారేదీ?


గుంప సోమేశ్వరస్వామి ఆలయం

కొమరాడ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి చెందినది గుంప సోమేశ్వర స్వామి ఆలయం. ప్రతిరోజూ భక్తులతో...నిత్య పూజలతో ఎంతో శోభాయమానంగా ఉండే ఈ దేవాలయం తొలి రోజు వెలవెలబోయింది. ఇటీవల తుఫాన్ కారణంగా నాగావళి, జంఝావతి నదుల్లో వచ్చిన వరదలతో గుడి వద్ద వేసిన గట్టు కొట్టుకుపోయింది. దీంతో దేవాలయంలోకి భక్తులు వెళ్లలేక.. పూజలు చేయలేదు. కార్తీకమాసం వచ్చినా ఇంతవరకు బీటీ రోడ్డు నిర్మాణం పూర్తి కాలేదు. సుమారు 20 రోజులు కావస్తున్నా దేవదాయశాఖ ఇప్పటికీ స్పందించకపోవడం ఏమిటని ఈ ప్రాంత ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కార్తీకమాసం ప్రారంభం కావడంతో ఇప్పటికైనా గట్టు ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

పుణ్యగిరిలో..

శృంగవరపుకోట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కార్తిక మాస ఉత్సవాలకు శృంగవరపుకోట పుణ్యగిరి ఆలయంలో ఏర్పాటు చేసినట్టు దేవాదాయ శాఖ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. క్యూలైన్‌లు, కొండ దిగువ ప్రాంతం నుంచి ఆలయం వరకు ఉన్న మెట్ల మార్గంలో రంగులు, సున్నాలు వేశారు. నాలుగు శాశ్వత, మరో నాలుగు తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. తాగునీరు, మజ్జిగ, చలువ పందిళ్లు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. కార్తిక సోమవారం ఉచిత ప్రసాద పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. తాత్కాలిక కేశఖండనశాలను ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు.

800 ఏళ్లుగా పూజలు..

బొబ్బిలి రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పెంట గ్రామంలో వెలసిన శ్రీఅన్నపూర్ణసహిత నగరేశ్వర స్వామి దేవాలయంలోని శివుడు దాదాపు 800 ఏళ్లగా భక్తుల నుంచి పూజలు అందుకుంటున్నాడు. వేగావతి నదీ తీరాన ఈ ఆలయం ఉంది. బుధవారం ఇక్కడ భక్తులు పూజలు ప్రారంభించారు. సోమవారాల్లో భక్తుల రద్దీ ఉంటుంది. శ్రీకాకుళం, విజయనగరం, మన్యం జిల్లాలతో పాటు ఒడిశాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధికంగా వస్తుంటారు. శివరాత్రికి ఇక్కడ మూడు రోజుల పాటు జాతర జరుగుతుంది.


పెంట గ్రామంలోని అన్నపూర్ణ సహిత నగరేశ్వర స్వామి ఆలయం

పాలకొండలో..

పాలకొండ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): డివిజన్ కేంద్రమైన పాలకొండతో పాటు వీరఘట్టం మండలాల్లో కార్తీకమాస పూజలు ప్రారంభమయ్యాయి. వందల ఏళ్ల చరిత్ర ఉన్న ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయం, భీమలింగేశ్వరాలయం, గోకర్ణేశ్వర, సదాశివుని ఆలయాల్లో కార్తీకమాస పూజలు మొదలు పెట్టారు. అన్నపూర్ణ సహిత సనారీవిశ్వేశ్వరస్వామి ఆలయం, పెద్ద కోటిపల్లిలోని కొండపై ఉన్న శివాలయంతో పాటు తంపటాపల్లి గ్రామంలోని ద్వి లింగ శివాలయాలు, నక్కలపేటలోని మరకత శివలింగం పూజలు అందుకుంటున్నాయి.


కోటిపల్లి శివాలయంలో..


నక్కలపేటలోని అమృత మృత్యుంజయ స్వామి

సీతానగరంలో..

సీతానగరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సీతానగరం, బలిజిపేట మండలాల్లో ప్రసిద్ధిగాంచిన పురాతన శివాలయాల్లో కార్తీక పూజలు బుధవారం ప్రారంభమయ్యాయి. సుమారు 800 మంది వరకు శివమాలలు ధరించి 41 రోజులు దీక్షలు చేపట్టనున్నారు. బలిజిపేట మండలంలోని నారాయణపురం గ్రామంలో దశాబ్దాల క్రితం నిర్మించిన పురాతన శివాలయం ఉంది. అరసాడ గ్రామ సమీపంలో సువర్ణముఖి నది ఒడ్డున ఉన్న ఈ పురాతన సువర్ణముఖేశ్వర ఆలయంలో ప్రతి సోమవారం అన్నదాన కార్యక్రమం జరుగుతుంది. అలాగే సహస్ర లింగార్చన, రుద్రాభిషేకాలు చేస్తున్నట్టు అర్చకులు గణేష్ వెంకటరమణ తెలిపారు. నది ఒడ్డున వేణుగోపాలస్వామి, లక్ష్మీనరసింహ స్వామి ఆలయాలలో తొమ్మిది వారాలు ముడుపులు కట్టి పూజలు చేస్తే కోరికలు తీరుతాయని భక్తుల విశ్వాసం. కార్తీక మాసంలో వచ్చే భక్తుల కోసం మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్టు అర్చకులు శ్రీనివాసాచార్యులు తెలిపారు.


సువర్ణముఖేశ్వర ఆలయం



శివమాల ధారణం... నియమాల తోరణం

గరుగుబిల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం వచ్చిందంటే గ్రామాల్లో శివ, అయ్యప్ప స్వాముల సందడి నెలకొంటుంది. కార్తీక మాసంలో మాలధారణకు అత్యంత ప్రాధాన్యం ఉంది. గతంలో అయ్యప్పస్వామి మాలధారణ మాత్రమే ఉండేది. ప్రస్తుతం శివ మాలధారులు కూడా గ్రామాల్లో అధికంగా కనిపిస్తున్నారు. అయ్యప్ప, శివమాల దీక్షల నిబంధనలు, నియమావళి దాదాపు ఒకే విధంగా ఉంటాయి. 41 రోజుల పాటు చల్లని నీటితో స్నానాలు ఆచరించడం, నేలపై నిద్రించడంతో పాటు శివునికి ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. దీక్షా సమయం ముగిసిన తరువాత ఏదో ఒక జ్యోతిర్లింగాన్ని దర్శించుకుంటారు. గతంలో శివ మాలధారణ చేసిన వాళ్లు కాశీ వెళ్లేవారు. ప్రస్తుతం అధిక శాతం భక్తులు జ్యోతిర్లింగాలలో ఒకటైన శ్రీశైలంలోని మల్లికార్జున స్వామిని దర్శించి.. మాల విసర్జన చేస్తున్నారు. ఈ ప్రాంతంలో విజయనగరం జిల్లాకు సంబంధించి సంగాం, శ్రీకాకుళం జిల్లాకు సంబంధించి శ్రీముఖలింగం తదితర క్షేత్రాలను అందుబాటులో ఉన్నవారు దర్శించుకుంటున్నారు. ఈ క్షేత్రాల్లో సౌకర్యాల లేమితో దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.


పంచముఖేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న దృశ్యం

సాలూరులో..

సాలూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం బుధవారం నుంచి ప్రారంభం కావడంతో పట్టణంలో ఉన్న శివాలయాలు శివమాలధారులు, భక్తులతో కిటకిటలాడాయి. పంచముఖేశ్వర స్వామిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. కన్యకా పరమేశ్వరి, కామాక్షి ఆలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో పూజలు చేశారు. పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల భక్తులు వివిధ ఆలయాల్లో పూజలు చేశారు.

సౌకర్యాల కల్పనకు దృష్టి సారించాలి



ఉత్తరాంధ్ర జిల్లాల పరిధిలోని ప్రముఖ శైవక్షేత్రాల్లో సరైన సౌకర్యాలు కల్పిస్తే శివ స్వాములు ఆ ప్రాంతాలకు వెళ్లే అవకాశం ఉంది. శ్రీముఖలింగం, సంగాం, రావివలస, తదితర ప్రాంతాల్లో స్వాముల అవసరాలకు అనుగుణంగా చర్యలు చేపడితే సౌకర్యంగా ఉంటుంది. దీనిపై అధికార యంత్రాంగం దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

-బంకపల్లి సూర్యం, గురుస్వామి, రావుపల్లి, గరుగుబిల్లి మండలం

అంకుళ్లవలసలో ఏనుగులు

కొమరాడ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కొమరాడ మండలం నుంచి ఏనుగుల గుంపు కదలడం లేదు. రాయిక్రవలస చెరువులో ఉన్న ఏనుగుల గుంపు బుధవారం సాయంత్రానికి అంకుళ్లవలస గ్రామ పరిధిలోని వరి పొలాలకు చేరుకున్నాయి. పొద్దుపోయే వరకు పొలాల్లోనే ఉన్నాయి. ఏనుగులు సంచరిస్తున్న నేపథ్యంలో రాత్రి వేళలో రైతులు బయట తిరగవద్దని అధికారులు సూచించారు.


పొలాల్లో ఉన్న ఏనుగులు

అందరి సహకారంతో ఉత్సవాలు విజయవంతం

● దాతల విరాళాలు రూ.2.2 కోట్లు
● ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు
● కలెక్టర్ రామసుందర్‌రెడ్డి


మాట్లాడుతున్న కలెక్టర్ రామసుందర్ రెడ్డి

విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): 'అందరి సహకారంతో ఈ ఏడాది విజయనగరం ఉత్సవాలు విజయవంతమయ్యాయి. ఈ ఉత్సవాలకు ఆర్థిక సాయం అందించిన ప్రజలు, పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు, విద్య, వైద్య రంగాల ప్రముఖులు సహా అందరికీ జిల్లా యంత్రాంగం తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు' అని కలెక్టర్ రామసుందర్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజల దాతృత్వం, సంస్కృతి పట్ల ప్రేమ ప్రతి సంవత్సరం పెరుగుతుండడం ఆనందకరమని అన్నారు. ఈ ఏడాది మొత్తం 435 మంది దాతలు రూ.2,00,21,904ను జిల్లా యంత్రాంగం ప్రత్యేకంగా కేటాయించిన విజయనగరం ఉత్సవాలు-2025 బ్యాంకు ఖాతాకు జమ చేశారని వెల్లడించారు. ఈ నిధులలో ఉత్సవ నిర్వహణకు రూ.1,41,39,019 ఖర్చు చేసి నట్టు చెప్పారు. మిగిలిన మొత్తాన్ని బ్యాంకు ఖాతాలో ఉంచి... వచ్చే ఏడాది నిర్వహించే ఉత్సవాలకు వినియోగిస్తామని తెలిపారు. దాతలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఉత్సవాలలో భాగంగా 12 వేదికలపై వివిధ సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించినట్టు చెప్పారు.

పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యం..

ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజల సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటున్నందున జిల్లాలో అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ రామసుందర్ రెడ్డి ఆదేశించారు. బుధవారం జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో పారదర్శకత, వేగం, బాధ్యతతో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా ప్రీ ఆడిట్ పెండింగ్ ఉన్న ఫిర్యాదులను రెండు వారాల్లో 20 శాతానికి తగ్గించాలని సూచించారు. సరిగా పరిష్కరించని ఫిర్యాదులు 8 శాతం దాటకూడదని స్పష్టం చేశారు. ఆడిట్ సందర్భంగా సంబంధిత అధికారులు ప్రజలకు నిజంగా ఫోన్ చేసి ఫిర్యాదుల స్థితి తెలుసుకుంటున్నారా? లేదా కేవలం రికార్డింగ్ కోసం చూపిస్తున్నారా? అనే విషయమై సమీక్షించాలని.. రియల్ టైమ్స్ కాల్స్ చేయాలని ఆదేశించారు. ఆడిట్ పెండింగ్ 20 శాతం లోపు ఉండాలని, ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తే...అది 10 శాతం కంటే ఎక్కువ కాకూడదని సూచించారు. రీ ఓపెన్ కేసులపై వారం రోజుల్లో సంబంధిత సిబ్బందికి వివరణ కోరుతూ మెమోలు జారీ చేయాలని ఆదేశించారు.


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

గిరిజన గ్రామాలకు రహదారులు

● మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

మెంటాడ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రహదారి సౌకర్యాలు మెరుగు పరిచేందుకు కూటమి ప్రభుత్వం పూర్తిగా దృష్టి సారించిందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా దశలవారీగా రహదారులను అభివృద్ధి చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. కొండలింగాలవలస-గజంగుడ్డి వలస గ్రామాల మధ్య రూ.2 కోట్ల 35 లక్షలతో నిర్మించిన రహదారి పనులకు మంత్రి సంధ్యారాణి బుధవారం శంకుస్థాపన చేశారు. రహదారి సౌకర్యం లేని గిరిజన గ్రామం ఉండరాదనే కృతనిశ్చయంతో ఉన్నామన్నారు. మైదాన ప్రాంతాల్లో కూడా రహదారి వ్యవస్థ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని చెప్పారు. ఐదేళ్ల విధ్వంస పాలనతో రాష్ట్రాన్ని 20 ఏళ్ల వెనక్కి నెట్టేసిన వైసీపీ ముఠాకు 11 స్థానాలతో ప్రతిపక్ష హోదా కూడా లేకుండా చేసినా వారి తీరు మారడం లేదని మంత్రి సంధ్యారాణి దుయ్యబట్టారు. పిల్లల జ్వరాలతో రాజకీయం, మరణాలతో శవ రాజకీయం చేయడం వైసీపీ వారికి వెన్నతో పెట్టిన విద్య అని ధ్వజమెత్తారు. మంత్రి గాడిదలు కాస్తోందా? అని తనను ఉద్దేశించి జగన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు మంత్రి సంధ్యారాణి ఘాటుగా స్పందించారు. కూటమి దెబ్బకు మూలకు చేరి గాడిదలు కాస్తున్నదెవరో ప్రజలకు తెలుసని ఎద్దేవా చేశారు. వైసీపీ హయాంలో మంత్రులు, ఉపముఖ్యమంత్రులుగా పనిచేసిన రాజన్నదొర, పుష్పశ్రీవాణి అప్పట్లో విషజ్వరాలు వ్యాప్తి చెందితే కనీసం పట్టించుకోలేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో చంద్రబాబు,పవన్ కల్యాణ్ సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధికి రోల్‌మోడల్‌గా మారుతోందని అన్నారు. నియోజకవర్గానికి మూడు ఎస్సీ హాస్టళ్లు మంజూరయ్యాయని వెల్లడించారు. మెంటాడ మండలం పెదమేడపల్లి ముఠా చానల్ అభివృద్ధికి రూ.40 లక్షలు మంజూరైనట్టు ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు చలుమూరి వెంకట్రావు, కొండ లింగాలవలస ఎంపీటీసీ సభ్యుడు గుమ్మిడి ప్రవీణ్, టీడీపీ నేతలు గెద్ద అన్నవరం, గుమ్మిడి వెంకన్న, రెడ్డి ఆదినారాయణ, రెడ్డి ఎర్రినాయుడు, జనసేన నాయకుడు చింత కాశీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'లో అవకతవకలకు చోటివ్వద్దు

● ప్రాజెక్ట్ డైరెక్టర్ శారదాదేవి

నెల్లిమర్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో అవకతవకలు జరిగితే సహించేది లేదని ప్రాజెక్ట్ డైరెక్టర్ శారదాదేవి హెచ్చరించారు. నెల్లిమర్ల మండలంలో బుధవారం నిర్వహించిన 19వ విడత సామాజిక తనిఖీ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పథకం లక్ష్యానికి అనుగుణంగా సిబ్బంది విధులు నిర్వహించాలన్నారు. వేతనదారులకు వంద రోజుల పని కల్పించాలని సూచించారు. అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలంలో వివిధ పనులకు రూ.18,80,45,564 ఖర్చు చేసినట్టు గుర్తించారు. పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, అటవీ శాఖలో 69 పనులకు గానూ రూ.2,20,56,687 ఖర్చు చేసినట్టు అధికారులు నివేదించారు. మొత్తం 1,223 పనులకు గానూ రూ.21,01,02,261 వ్యయానికి సంబంధించి సామాజిక తనిఖీ చేశారు. ఈ తనిఖీలో వివిధ అంశాలను గుర్తించారు. పారసాం, సతివాడ, మొయిద, పూతికపేట, తమ్మాపురం, గుషిణి, అలుగోలు గ్రామాల్లో మస్తర్లలో దిద్దుబాట్లు, జోగిరాజుపేట, బొప్పడాం గ్రామాల్లో కొన్ని మస్తర్లలో సంతకాలు లేకపోవడాన్ని గుర్తించారు. కొన్ని చెరువులు, పారం పాండ్ పనుల కొలతలలో తేడాలు ఉన్నట్టు గుర్తించారు. టెక్కలి పంచాయతీలో 10 మామిడి మొక్కలు చనిపోయినట్టు తేలింది. ఈ కార్యక్రమంలో డీవీవో వెంకటరమణ, ఏపీడీ పద్మజ, ఎంపీడీవో రామకృష్ణరాజు, ఎస్ఆర్‌పీ పున్నంనాయుడు, స్టేట్ సోషల్ ఆడిట్ ప్రోగ్రాం మేనేజర్ ఈశ్వర్, ఏపీవోలు అరుణ, రామారావు, ఈసీలు కార్తీక్, యుగేష్ తదితరులు పాల్గొన్నారు.

కల్లాలుగా మార్చి.. పంటలను ఆరబోసి

● వాహనచోదకులకు అగచాట్లు ● ఇదీ గొర్లెసీతారాంపురం-నారాయణప్పవలస రహదారిపై పరిస్థితి

బొబ్బిలి రూరల్,అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొర్లె సీతారాంపురం నుంచి నారాయణప్పవలస వెళ్లే రహదారిపై రైతులు మొక్కజొన్న కంకులను ఆరబోస్తున్నారు.ఇక్కడ తరచూ వరి, మొక్కజొన్నతదితర పంటల ఆరబోతకు రహదారులే కల్లాలుగా వినియోగిస్తున్నారు. పంట దిగుబడులను ఆరబోసుకోవడానికి ప్రభుత్వం కల్లాల నిర్మాణానికి గతంలో రాయితీని ప్రకటించింది. అప్పట్లో సరైన ప్రచారం లేకపోవడంతో రైతులు సద్వినియోగం చేసుకోలేకపోయారు. అయితే ఇటీవల కురిసిన వర్షాలకు నేలపై తడి ఆరకపోవడంతో రైతులు రహ దారిపై మొక్కజొన్న కంకులను ఆరబోస్తున్నారు. కొద్దిరోజులుగా రాత్రి పగళ్లు తేడాలేకుండా రహదారులపైనే కుప్పగా పోసి ఆరబెట్టుతుండడంతో ఈ మార్గంలో వచ్చిపోయే వాహనచోదకులు చీకట్లో గుర్తించలేక అగచాట్లకు గురవుతున్నారు. ఏటా ఖరీఫ్, రబీలో ఇదే పరిస్థితి నెలకుం టోంది. ఇప్పటికైనా వ్యవసాయ, రెవెన్యూ శాఖ అధికారులు స్పందించి తమ పంటలను ఆరబెట్టుకోవడానికి స్థలాలను గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.



నారాయణప్పవలస- గొర్లెసీతారాంపురం మధ్య రహదారిపై మొక్కజొన్న కంకులను ఆరబోసిన దృశ్యం

రోడ్డు ప్రమాదంలో జూనియర్ అసిస్టెంట్ మృతి



శ్రావణ్ కుమార్(ఫైల్)

తెర్లాం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి):నెమాలాం జడ్పీ ఉన్నత పాఠశాల జూనియర్ అసిస్టెంట్ కడమటి శ్రావణ్ కుమార్ (31) రోడ్డు ప్రమాదంలో బుధవారం మృతి చెందారు. ఎస్ఐ సాగర్‌బాబు కథనం మేరకు.. శ్రావణ్ ద్విచక్ర వాహనంపై తన సహచర ఉద్యోగి బి.రమణమ్మతో కలిసి బుధవారం పాఠశాలకు వెళ్తున్నాడు.చుక్కవలస సమీపంలో మలుపు వద్ద బూరిపేట నుంచి పెరుమాళి వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్న చింత శివాజీ శ్రావణ్ బైక్‌ను ఢీకొన్నాడు.దీంతో శ్రావణ్ కింద పడిపోయాడు. విషయం గమనించిన స్థానికులు పెరుమాళి పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స చేసిన వైద్యులు మెరుగైన వైద్యంకోసం మరో ఆసుపత్రికి తరలించే ఏర్పాటుచేస్తున్న సమయంలో శ్రావణ్ మృతిచెందాడు. శ్రావణ్ బైక్‌పై వెళ్తున్న రమణమ్మకు స్వల్పగాయాలయ్యాయి. శివాజీ తలకు బలమైన గాయంకావడంతో రాజాం ఆసుపత్రికి తరలించారు.శ్రావణ్ తల్లి కృష్ణవేణి ఉపాధ్యాయినిగా విజయనగరంలో విధులు నిర్వహిచేవారు. ఆమె కరోనా సమయంలో మృతి చెందడంతో అప్పటికే ఎంటెక్ పూర్తిచేసిన శ్రావణ్‌కు కారుణ్య నియమాకాల్లో భాగంగా నెమాలాం ఉన్నతపాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా ప్రభుత్వం నియమించింది.శ్రావణ్ స్వగ్రామం విజయనగరం ఉడాకాలనీ కాగా ఉద్యోగ రీత్యా పెరుమాళిలో నివాసముంటున్నారు. శ్రావణ్‌కుమార్‌కు భార్య మచ్చ నవీన నారాయణమ్మ, కుమారుడు ధ్రువణ్ సాయి శ్రావణ్ ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాడంగి సీహెచ్‌సికి తరలించారు. కాగా శ్రావణ్‌కుమార్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఎంఈవో త్రినాథరావు, ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు.

పోక్సో కేసులో వ్యక్తికి ఐదేళ్ల జైలు

బొబ్బిలి అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి):పట్టణ శివారులోని ఓ కాలనీకి చెందిన తండ్రి.. కన్న కూతురిపైనే కన్నేశాడు. అతడిపై అప్పట్లో పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఆ వ్యక్తికి విజయనగరం పోక్సో కోర్టు మేజిస్ట్రేట్ కె.నాగమణి బుధవారం ఐదేళ్ల జైలు శిక్ష, రూ.రెండువేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. సీఐ కటకం సతీష్‌కుమార్ కథనం మేరకు.. 2024 జూలై 1న ఆ వ్యక్తి ఇంట్లో ఎవరూ లేని సమయంలో తన 11 ఏళ్ల కుమార్తెపై అఘాయిత్యం చేయబోయాడు. అప్పటి డీఎస్పీ పి.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఘటనాస్థలానికి చేరుకుని బాలికను రక్షించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆయనపై నేరం రుజువు కావడంతో జిల్లా పోక్సో కోర్టు మేజిస్ట్రేట్ శిక్ష ఖరారుచేశారు. దోషికి సకాలంలో శిక్ష పడేలా కేసును దర్యాప్తు చేసిన సీఐ సతీష్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ ఎన్.మన్మథను పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

పార్వతీపురం/బెలగాం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురంలోని యువకుడు పవన్‌పై పట్టణ పోలీసులు బుధవారం పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. ఈనెల 19న ఆదివారం రాత్రి సమయంలో ఐదో తరగతి చదువుతున్న బాలికతో పవన్ అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో బాలికను నిర్మాణంలో ఉన్న భవనంలోకి తీసుకు వెళ్లి అరిస్తే చంపేస్తానని బెదిరించాడు. దీంతో బాలిక ఎవరికీ చెప్పలేదు. చివరకు మంగళవారం బాలిక జరిగిన విషయాన్ని తల్లి దండ్రులకు చెప్పడంతో వారు పట్టణ పోలీసులను ఆశ్రయించారు. బాలికపై అనుచితంగా ప్రవర్తించిన పవన్‌పై పోక్సో కేసు నమోదు చేశామని సీఐ మురళీధర్ చెప్పారు.

బలసలరేవు వంతెన వద్ద సామగ్రి చోరీ

సంతకవిటి, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): మండలంలోని వాల్తేరులో నాగావళి నదిపై నిర్మాణంలో ఉన్న బలసలరేవు వంతెనకు సంబంధించిన బ్యాటరీలు, ఐరన్ సెంట్రింగ్ షీట్లు, మూడు హెచ్‌పీ విద్యుత్ మోటార్లు చోరీకి గురయ్యాయని ఎస్ఐ ఆర్.గోపాలరావు తెలిపారు.మంగళవారంరాత్రి చోరీ జరిగిన విషయం నైట్‌వాచ్‌మెన్లు గమనించి సంస్థ పతినిధులకు తెలియజేశారు. బుధవారం వారు ఫిర్యాదుమేరకు కేసునమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. కాగా ప్రస్తుతం బలసలరేవు వంతెనపనులు నిలిచిపోయిన విషయం విదితమే.

బాలికల హాస్టల్‌ను పూర్తి చేయాలి: ఏపీసీ



గరివిడి: మాట్లాడుతున్న రామారావు

రేగిడి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి):లక్ష్మీపురం హైస్కూల్‌కు అనుబంధంగా చేపట్టిన బాలికలహాస్టల్ భవననిర్మాణాలు పూర్తిచేయాలని సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ రామారావు తెలిపారు. లక్ష్మీపురంలో నిర్మాణంలో ఉన్న బాలికల హాస్టల్ భవనాలను బుధవారం పరిశీలించారు. 20 రోజుల్లో బాలికలకు వసతిగృహం అందుబాటు తెచ్చేందుకు అన్నిచర్యలు తీసుకొంటున్నట్లు తెలిపారు.ఆయన వెంట హెచ్ఎం కామేశ్వరరావు ఉన్నారు.

●గరివిడి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): గరివిడి కేజీబీవీ పాఠశాలను సమగ్ర శిక్షాఅభియాన్ జిల్లా అడిషనల్ కోఆర్డినేటర్ ఎ.రామారావు పరిశీలించారు.ఈ సందర్భంగా పదోతరగతి విద్యార్థినులతో మాట్లాడుతూ బోధనపై ఆరాతీశారు. అనంతరం మధ్యాహ్న భోజన పథక నిర్వహణ పరిశీలించారు.

●వేపాడ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి):గుడివాడ మండల పరిషత్ పాఠశాలను ఎంఈవో పి.బాలభాస్కరరావు పరిశీలించారు.ఈ సందర్భంగా ఇటీవల అందించిన టీఆర్ఎల్ఎఫ్ఎల్ఎన్ మెటీరియల్ వినియోగంపై ఆరాతీశారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

జామి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి):ఇప్పటినుంచే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంకావాలని టీడీపీ నాయకుడు కొండపల్లి కొండబాబు కోరారు. బుధవారం భీమసింగిలో టీడీపీ మండలాధ్యక్షుడు స్వామినాయుడు ఆధ్వర్యంలో రానున్న స్థానికసంస్థల ఎన్నికల్లో ఓటరు జాబితాలపై అవగాహన, నూతన ఓటర్లను చేర్పించడం, బూత్‌లెవెల్ ఇన్‌చార్జి విధులపై మండలస్థాయి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కర్రోతు శ్రీనివాస్, దనియాల పైడిరాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు అప్పలరాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటోమొబైల్ కోర్సులపై అవగాహన

జామి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి):జామి ఉన్నతపాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు బుధవారం ఇండస్ట్రియల్ టూర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్.కోటమండలంలో గల బెహర కళాశాలలో కంప్యూటర్స్, ఆటోమొబెల్స్, ఎలక్ట్రికల్ కోర్సులను చూపించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం శేఖర్, ఒకేషనల్ ఉపాధ్యాయులు సంతోష్, అనీల్, శ్రీలలిత పాల్గొన్నారు.

పీఏసీఎస్‌లో సభ్యత్వ నమోదు

కొత్తవలస, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కొత్తవలస పీఏసీఎస్‌లో సభ్యత్వాల నమోదుకోసం అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పీఏసీఎస్ అధ్యక్షుడు కోళ్ల వెంకట రమణ తెలిపారు. బుధవారం రామలింగపురంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎక్కువమంది సభ్యులిగా చేరడంతో సొసైటీ అభివృద్ధి చెందడమే కాకుండా రైతులకు రుణాలు ఇవ్వడానికి వీలుంటుందన్నారు.

ఇంటి పన్నుల వసూలు లక్ష్యాలను పూర్తిచేయాలి

రాజాం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఇంటి పన్నుల వసూలు లక్ష్యాలను సకాలంలో పూర్తిచేయాలని డిప్యూటీ ఎంపీడీవో వి.శ్రీనివాసరావు పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు, బుధవారం మండలంలోని బొడ్డవలస, పొగిరిలో ఇంటిపన్నులు వసూళ్ల డ్రైవ్‌ను పరిశీలించారు. పెనుబాకలో డోర్ టూ డోర్ చెత్త సేకరణను పరిశీలించి మహిళలకు అవగాహన కల్పించారు.

భూములు వెనక్కి ఇప్పించాలి

ఎస్.కోట రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తమ భూములువెనక్కి ఇప్పించాలని జిందాల్ నిర్వాసితులు కోరారు. బొడ్డవరలో జిందాల్ నిర్వాసితులు నిర్వహిస్తున్న రిలేదీక్షలు బుధవారానికి 124వరోజుకు చేరాయి. ఈ సందర్భంగా నిర్వాసితులు మాట్లాడుతూ నాలుగునెలలుగా నిరసన తెలియజేసి విజయనగరంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రాలు ఇచ్చినా అధికారులు తూతూ మంత్రంగా వచ్చి విచారణ చేయడం వెళ్లడం తప్ప పరిష్కారం లభించలేదన్నారు. ప్రత్యేక సిబ్బందిని నియమించి వినతులపై విచారణ చేయించాలని కోరారు.

ఒకటి నుంచి సైన్స్ పోటీలు

నెల్లిమర్ల, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): బీవీఎం, ఏపీ సైన్స్ సిటీ ఏపీ కాస్ట్ ఆధ్వర్యంలో 8,9,10 తరగతుల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కౌశల్ సైన్స్ ప్రతిభా ప్రోత్సాహక పోటీలు వచ్చేనెల ఒకటో తేదీ నుంచి నిర్వహించనున్నట్లు జిల్లా కోఆర్డినేటర్ శివకు బంగారయ్య ఒక ప్రకటనలో తెలిపారు.శుక్రవారంనుంచి ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. పాఠశాల స్థాయి పోటీలు నవంబరు 1, 2,3,4 తేదీల్లో, జిల్లాస్థాయి పోటీలు నవంబరు 27,28 తేదీల్లోనూ, రాష్ట్రస్థాయి పోటీలు డిసెంబరు 27న జరుగుతాయని తెలిపారు.

తెలంగాణలో ఎక్సైజ్ ఎస్ఐగా రామతీర్థం వాసి ఎంపిక

నెల్లిమర్ల, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రామతీర్థం గ్రామానికి చెందిన కోటిపాటి హరి కుమార్తె సుచరిత తెలంగాణ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్-2 పరీక్షలో విజేతగా నిలవడంతో గ్రామంలో బుధవారం సన్మానించారు. ఇటీవల విడుదలైన గ్రూప్స్ ఫలితాల్లో ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగం సాధించింది. కార్యక్రమంలో రామతీర్థం మాజీ సర్పంచ్ కోటిపాటి తిరుపతిరావు, పద్మలత, ఉపాధ్యాయులు కోటిపాటి రజిత, రమణ, రామకృష్ణ పాల్గొన్నారు.

మారిక పాఠశాల దత్తత

వేపాడ, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కరకవలస పంచాయతీ శివారు గిరిశిఖర గ్రామంగా గుర్తింపు పొందిన మారిక పాఠశాలను దత్తత తీసుకున్నట్లు సహసం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు మాచవరపు గణేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇక్కడి విద్యార్థుల విద్యాభివృద్ధికి, వైద్య, తాగునీరు ఏర్పాటుకు తమ సంస్థ కృషి చేస్తుందని పేర్కొన్నారు.ఈ మేరకు బుధవారం పాఠశాలకు 20 వేలు విలువ చేసే ఇనుప బీరువ, 30 కుర్చీలు, ఉపాధ్యాయులకు ఉపయోగపడే కుర్చీలు, టేబుల్, విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

చీపురుపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జి.అగ్రహారంలో పైడితల్లిఅమ్మ వారి ఆలయ నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు 50 వేలు విరాళంగా నిర్మాణకమిటీకి అందజేశారు. కార్యక్రమంలో ఏజీపీ సూర్యనారాయణ, టీడీపీ నాయకులు పతివాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రణాళికలు రూపొందించాలి

గజపతినగరం, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో పనులు చేపట్టేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని ఏపీవో కృష్ణవేణి కోరారు. బుధవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఫీల్అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని 30 పంచాయతీల్లో 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి అవసరమైన పనులను గుర్తించి అందుకు ప్రణాళికలను సిద్ధం చేయాలని కోరారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

నెల్లిమర్ల, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య రంగంలో వస్తున్న నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలని సెంచూరియన్ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ప్రశాంతకుమార్ మహంతి పిలుపునిచ్చారు. బుధవారం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ఎక్స్‌ప్లోరింగ్ ఇన్నోవేషన్స్ ఇన్ ఇమేజింగ్ అండ్ కార్డియోవాస్క్యులర్ కేర్ 2025 అన్న అంశంపై ఏర్పాటు చేసిన సదస్సుప్రారంభించారు.కార్యక్రమంలో న్యూక్లియర్ మెడిసిన్ అండ్ రేడియాలజీ నిపుణులు బి.వసుంధర, డాక్టర్ బొడ్డపాటి ప్రశాంత్, డాక్టర్ బోధరాజు సూర్యరేఖ, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, డిప్యూటీ రిజిస్ట్రార్, రేడియాలజీ విభాగాధిపతి ఆసీఫ్, డీన్ విజయ్‌బాబు, నూకరాజు పాల్గొన్నారు.

వీలుపర్తిలో పశువైద్య శిబిరం

వేపాడ,అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీలుపర్తి పంచాయతీలో బుధవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు గర్భకోశచికిత్సలు నిర్వహించినట్లు పశువైద్యాధికారి కోరాడ గాయిత్రి తెలిపారు.కార్యక్రమంలో సర్పంచ్ శానాపతి లీల,అప్పారావు, గ్రామ పెద్దలు, పశు సంవర్ధకశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి అర్జీని పరిష్కరించాలి: కలెక్టర్

విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌లో నమోదైన ప్రతి అర్జీని గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ రామసుందర్ రెడ్డి కోరారు. పరిష్కరించిన అంశాలపై అర్జీదారుడికి లిఖితపూర్వకంగా ధ్రువీకరణ పత్రం ఇవ్వాలని తెలిపారు.వివిధ అంశాలపైకలెక్టర్లతో రాజధాని అమరావతి నుంచి వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించగా, జిల్లా నుంచి కలెక్టర్‌తోపాటు జేసీ ఎస్.సేతుమాధవన్ హాజరయ్యారు. గృహాల లేఅవుట్‌ల్లో ఖాళీగాఉన్న స్థలాలనుగుర్తించి, అందరికీ ఇళ్లు కేటాయించేలా ప్రతిపాదనలు సిద్ధంచేయాలని సీసీఎల్ఏ ముఖ్యకార్యదర్శి జయలక్ష్మి, కార్యదర్శి వెంకట మురళి ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో ఎస్.శ్రీనివాస మూర్తి పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించాలి

ప్రతినెలా పౌరహక్కుల దినం గ్రామాల మధ్యలో జరగాలని,ఇందులో పోలీసు, రెవెన్యూ అధికారులు పాల్గొని ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టంపై అవగాహన కల్పించాలని కలెక్టర్ రామసుందర్ రెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లావిజిలెన్స్ అండ్ మోనటరింగ్‌సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా ఎస్సీఎస్టీ కాలనీలకు రహదారులులేవని, శ్మశానాలు ఆక్రమణలకు గురవుతున్నాయని సభ్యులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు.దీంతో కలెక్టరు స్పందించి మాట్లాడుతూ ఉపాధినిధులతో రహదారులను నిర్మించడానికి ప్రణాళికలు రూపొందించాలని డ్వామా అధికారులకు సూచించారు. జిల్లాలో నమోదైన 35 అట్రాసిటీ కేసులకు గాను 42 లక్షల 79 వే పరిహారంగా చెల్లించినట్లు తెలిపారు. సమావేశంలో ఎస్పీ దామోదర్ , ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, డీఆర్వోశ్రీనివాస్ మూర్తి, సోషల్ వెల్ఫేర్ డీడీ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సహకార సంస్థలు డేటాను అందించాలి

ఫంక్షనల్ సహకార సంస్థలు డేటాను జిల్లా సహకార అధికారికి సమర్పించాలని, ఆ డేటాను నేషనల్ కోఆపరేటివ్ బేస్ పోర్టల్‌లో అప్‌డేట్ చేయాల్సి ఉంటుందని కలెక్టర్ రామసుందర్ రెడ్డి తెలిపారు. బుధవారం రాత్రి కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ కోఆపరేటివ్ ద్వారా జిల్లాలో 19,500 మెట్రిక్ టన్నులు సామర్థ్యం గల గోడౌన్ స్పేస్ అందుబాటులో ఉందని మార్కెటింగ్ ఏడీతో మాట్లాడుకుని, ఆ స్పేస్‌ను వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని డీసీవో రమేష్‌కు సూచించారు.



బాక్సింగ్ క్రీడాకారులతో కలెక్టర్ రామసుందర్‌రెడ్డి

జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలకు ఇద్దరి ఎంపిక

విజయనగరం కలెక్టరేట్ అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో ఇటీవల జరిగిన స్కూల్స్‌గేమ్స్‌లో జిల్లా నుంచి అండర్-14, అండర్-17, అండర్ -19 కేటగిరిల్లో బాక్సింగ్ పోటీల్లో పాల్గొనగాఅండర్-17లో పి.దుర్గాప్రసాద్ (46 కేజీలువిభాగంలో) సచిన్ (75కేజీల విభాగంలో) రాష్ట్రస్థాయిలో బంగారుపతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిద్దరూ ఈనెల 28 నుంచి అరుణాచల్‌ప్రదేశ్‌లో జరగనున్న జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికకాగా శుక్రవారం బయలుదేరి వెళ్లనున్నారు. కాగా అండర్-19 కేటగిరిలో హేమేష్‌వర్ధన్‌రెడ్డి 46 కేజీల విభాగంలో, ఎస్.యశ్వంత్60కేజీల విభాగంలో రాష్ట్రస్థాయిలో బంగారుపతకాలు సాధించి జాతీయ స్థాయికి ఎంపికకావడంతో బుధవారం రాత్రి కలెక్టరు రామసుందర్ రెడ్డిని కలిశారు.

పని తీరు ఆధారంగా పార్టీలో గుర్తింపు

● చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు



మాట్లాడుతున్న కళావెంకటరావు

చీపురుపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి):పని తీరు ఆధారంగానే పార్టీలో గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు తెలిపారు. బుధవారం చీపురుపల్లిలో ఏఎంసీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌గా రేగాన రామారావు,వలిరెడ్డి శ్రీరాములునాయుడులతోపాటు సభ్యులు ప్రమాణ స్వీకారంచేశారు. ఈ సందర్భంగా కళా వెంకటరావు మాట్లాడుతూ వైసీపీ అధికారంలో ఉన్నంత కాలం దోచుకోవడంపై దృష్టిపెట్టిన మాజీ సీఎం జగన్‌మోహనరెడ్డి ఇప్పుడు కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూడలేకపోతున్నారన్నారు. వివిధ సంస్థలు లక్షల కోట్లతో విశాఖపట్నానికి తరలివస్తుంటే, వైసీపీ నాయకులు మాత్రం లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు, మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు, పార్టీ నాయకులు కుచ్చర్లపాటి త్రిమూర్తులరాజు, దన్నాన రామచంద్రుడు, పైల బలరాం, సారేపాక సురేష్ పాల్గొన్నారు.

సమాజ సేవకు ముందుకు రావాలి: కోళ్ల

లక్కవరపుకోట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): చదువుకున్న ప్రతి యువకుడు సమాజ సేవకు ముందుకురావాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి కోరారు. బుధవారం లక్కవరపు కోట ఏపీ మోడల్ స్కూల్‌లో సాహసం స్వచ్ఛంద సంస్థ తొమ్మిదో వార్షికోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు గణేష్, పార్వతీపురం నియోజక వర్గ జనసేన ఇన్‌చార్జి ఆదాడ మోహనరావు, ఎంఈవో సీహెచ్ కూర్మారావు, జి.శ్రీనివా సరావు, హెచ్ఎం గోపాలరావు పాల్గొన్నారు.


క్రీడలపై మక్కువ పెంచుకోవాలి: ఎమ్మెల్యే



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి

భోగాపురం, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి):చదువుతోపాటు క్రీడలపై మక్కువ పెంచుకోవాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవి కోరారు. బుధవారం భోగాపురం జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జిల్లాస్థాయి అండర్-17 బాలబాలికల వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. కాగా జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు ఉదయం పదిగంటలకు ప్రారం భించాల్సి ఉండగా ఎమ్మెల్యే 11.45 నిమిషాల వరకు మైదానానికి చేరుకోలేదు. దీంతో కొందరు బాలబాలికలు ఎండను తట్టుకోలేక చెట్టుకిందకు చేరుకొని అవస్థలకు గురయ్యారు. అనంతరం జనసేన నాయకుడు పల్లంట్ల జగదీస్ ఆర్థిక సహాయంతో 100 టీషర్టులను బాలబాలికలకు ఎమ్మెల్యే అందజేశారు.కార్యక్రమంలో నాయకులు పల్లంట్ల జగదీష్, పల్లరాంబాబు, మాతా నవీన్, బొల్లుత్రినాథ్, గుండపునూరిబాబు, పీఈటీ నాగన్న, చిన్నారి పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట: వీసీ



మాట్లాడుతున్న సుబ్బారావు

విజయనగరం రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయంలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేయనున్నట్లు వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ వీవీ సుబ్బారావు చెప్పారు. బుధవారం యూనివర్సిటీలో జరిగిన ఫ్రెషర్స్ డే వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రభుత్వం యూనివర్సిటీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటోందని తెలిపారు. విద్యార్థులు విలువలతో కూడిన విద్యనభ్యసించడంతో పాటు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థుల పట్ల అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కార్య క్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆర్. రాజేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ జీజే నాగరాజు, బేసిక్ సైన్సెస్ విభాగాధిపతి సౌభాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజల దృష్టి మళ్లించడానికి జగన్ ప్లాన్

● మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు



మాట్లాడుతున్న కర్రోతు బంగార్రాజు

భోగాపురం, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో ఐదేళ్ల లిక్కరు మాఫియా నడిపి రూ.3500 కోట్లు దోచుకున్న విషయంపై ప్రజల దృష్టి మళ్లించడానికి జగన్ కుట్రలకు ప్లాన్ చేశారని మార్క్‌ఫెడ్ చైర్మన్, టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతుబంగార్రాజు ఆరోపించారు. బుధవారం భోగాపురంలో విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీయాలన్న ఉద్దేశంతోనే కుట్రపూరితంగా కల్తీ మద్యం ఫార్ములాను తాడేపల్లి ప్యాలెస్‌లో తయారు చేశారన్నారు. గత ప్రభుత్వంలో మద్యం తయారీ కంపెనీలన్నింటిని జగన్ గుప్పిట్లో పెట్టుకొని జే బ్రాడ్లు మాత్రమే తయారు చేసి దీని ద్వారా రాష్ట్రంలో 30వేల మంది ప్రాణాలు కోల్పోయారని మరో 30 లక్షల మంది అనారోగ్య పాలయ్యారన్నారు. నాణ్యమైన మద్యం తెలుసుకోవడానికి ప్రభుత్వం సురక్షయాప్ తీసుకొచ్చిందన్నారు. యాప్‌కు సంబంధించి ఈనెల 29వ తేదీ వరకు అందరికి అవగాహన కల్పిస్తామని తెలిపారు.అనంతరం గంగిరావి చెరువు సమీపంలో ఉన్న మద్యం దుకాణానికి వెళ్లి అక్కడ సురక్ష యాప్‌పై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు కర్రోతు సత్యనారాయణ, పిడుగు తోటారావు, దాసరి అప్పలస్వామి, తాతారావు, బొడ్డహరి పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీల పరిశీలకుడిగా కృష్ణంరాజు

కొత్తవలస, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కొత్తవలసకు చెందిన జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.కృష్ణంరాజు తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులో ఈనెల 27 నుంచి 29 వరకు జరగనున్న అండర్-17 రాష్ట్రస్థాయి వాలీబాల్ బాలబాలికల పోటీలకు పరిశీలకుడిగా నియమితులయ్యారు. ఈమేరకు నియామక ఉత్తర్వులను కమిషనర్ కార్యాలయం నుంచి వెలువడ్డాయి. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను నవంబరు పదో తేదీ నుంచి 14 వరకు ఉత్తరప్రదేశ్‌లోని రాయబరేలీలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు పంపించనున్నట్లు కృష్ణంరాజు తెలిపారు.

కళాకారులకు అభినందన

విజయనగరం బాబామెట్ట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): విజయనగరం అక్కినేని సాంస్కృతిక సమాజం తరపున ఇటీవల తెనాలిలో వీణా అవార్డుల కార్యక్రమంలో దర్శకుడు గవర సత్తిబాబు బృందం ప్రదర్శించిన మోహిని భస్మాసుర నాటకం ఉత్తమ ప్రదర్శనగా నిలవడంతో వారిని అభినందించారు. విజయనగరంలోని ఆర్యసోమయాజుల కాశీపతిరావు స్మారక భవనంలో ఆత్మీయ సమావేశం నిర్వహించి కళాకారులను అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ మాట్లాడుతూ విజయనగరం నుంచి శ్యామలాంబ ఫైనార్ట్స్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన ఆదికవి నన్నయ భట్టు ఉత్తమ ప్రదర్శనగా నిలవడం గొప్ప విషయమన్నారు. కళాకారులు గవర సత్తిబాబు, తిరుపతినాయుడు, కంది త్రినాథ్, పద్మలను సత్కరించడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో దవళ సర్వేశ్వరరావు, ఉమామహేశ్వరరావు, పెద్దింటి అప్పారావు, వాసుదేవరావు, అబ్బులు పాల్గొన్నారు.

త్రినాథరావుకు ఉత్తమ సంగీత దర్శకుడిగా అవార్డు

గరివిడి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కందిపేట గ్రామానికి చెందిన కంది త్రినాథరావు ఉత్తమ సంగీత దర్శకుడు అవారు లభించింది. ఇటీవల గుంటూరు జిల్లా తెనాలిలో వీణ అవార్డ్స్‌వారు జాతీయస్థాయి పద్య, నాటక పోటీలను నిర్వహించగా తెలుగు రాష్ట్రాల నుంచి 20 నాటకాలు పోటీపడ్డాయి. ఇందులో ఆదికవి నన్నయ భట్టు, మోహినీ భష్మాశుర నాటికలు ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవశం చేసుకున్నాయి. ఈ రెండు నాటకాలకు త్రినాథరావు సంగీత దర్శకత్వం వహించారు. త్రినాథరావుకు అవార్డు రావడంపై పలువురు అభినందించారు.

సోంపురంలో రాజ్యాంగ దినోత్సవం

వేపాడ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోంపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో రాజ్యాంగదినోత్సవం బుధవారం నిర్వహించారు.ఈసందర్భంగా ఎంఈవో పి.బాల భాస్కరరావు ఆధ్వర్యంలో ఎనిమిది, తొమ్మిదో తరగతుల విద్యార్థులకు పాఠశాల స్థాయిలో లోకల్ గవర్నెన్స్ అన్న అంశంపై వ్యాచరచన, మై.ఫేవరేట్ ఫ్రీడమ్ ఫైటర్ అన్న అంశంపై వక్తృత్వ పోటీలు, భారత రాజ్యాంగం అన్న అంశంపై క్విజ్ నిర్వహించి విజేతలుగా నిలిచిన 18 మందికి బహుమతులు అందజేశారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా శ్రీనివాసరావు, పి.రమేష్‌నాయుడు, బి.జ్యోతి, ఎస్.గోవిందరావు వ్యవహరించారు.

మూణ్నాళ్ల ముచ్చటే

● ఐదు నెలలకే ముషిడిపల్లి- కృష్ణాపురం బీటీ రోడ్డు గోతులమయం ● మళ్లీ అగచాట్లు తప్పడం లేదంటున్న వాహనచోదకులు

ఎస్.కోట రూరల్, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముషిడిపల్లి- కృష్ణాపురం తారురోడ్డు మూణ్నాళ్ల ముచ్చటగా మారింది. నిర్మించి ఐదు నెలలకే అడుగడుగునా గోతులమయంకావడంతో వాహనచోదకులు, ప్రయాణికులు అగచాట్లకు గురవుతున్నారు. గతంలో ఈ రోడ్డుపై ప్రయాణమంటే హడలిపోయేవారు. ఈనేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు చొరవ తీసుకున్నారు. విశాఖపట్నం గ్రేటర్ నగరపాలకసంస్థ నుంచి రెండువిడతలుగా కోటి 19 లక్షలు, మరో కోటి 27లక్షలతో ఆ సంస్థ కాంట్రాక్టర్లు తారురోడ్డును నిర్మించారు. దీంతో వాహనచోదకులు, ప్రయాణికుల అగచాట్లు తీరాయి.గంటసేపు ప్రయాణించే ఈ మార్గంలో పావుగంటలో గమ్యస్థానాలకు చేరుకునేవారు.అయితే వాహనచోదకులు ఆనందం మూణాళ్లముచ్చగా మారింది.గతంలో గోతులు ఉన్నచోటే ఏర్పడడంతోమళ్లీ అగచాట్లుతప్పడంలేదని చోదకులు చెబుతున్నారు. కాగాముషిడిపల్లి- కృష్ణాపురం బీటీరోడ్డు వర్షాలకు పలుచోట్ల దెబ్బతిందని జీవీఎంసీ వాటర్‌సప్లయ్ డీఈ వీరయ్య తెలిపారు. 20 టన్నుల బరువు గల వాహనాలు వెళ్లాల్సి ఉండగా రోడ్డుపై 40టన్నులబరువుతో వాహనాలుఈమార్గంలో రాకపోకలు సాగిస్తున్నాయని చెప్పారు.ఈరోడ్డులో మరమతులకు జీవీఎంసీ రూ.18లక్షలు విడుదల చేసిందని, త్వరలో మరమతులు ప్రారంభిస్తామని తెలిపారు.



దెబ్బతిన్న ముషిడిపల్లి-కృష్ణాపురం రహదారి

తీరం.. కలవరం

(ఐదో పేజీ తరువాయి)

విషయం తెలియజేశారు. వారు మత్స్యకారుల కుటుంబీకులకు, కొండ్రాజుపాలెంకు చెందిన నాయకుడు చిన్నారావుకు సమాచారం అందించారు. ఆపై నేతలు, అధికారులకు విషయం తెలియజేశారు. కాగా బంగ్లాదేశ్ కోస్టుగార్డుకు మత్స్యకారులు చిక్కినట్లు తెలుసుకున్న వారి కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. వారిని క్షేమంగా ఇంటికి తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. కాగా మత్స్యకారులు బంగ్లాదేశ్ కోస్టుగార్డుకు చిక్కిన విషయమై హోంశాఖకు విన్నవించామని, వారిని క్షేమంగా ఇంటికి తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని కలెక్టర్ రామసుందర్‌రెడ్డి తెలిపారు. ఇదే విషయాన్ని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు దృష్టికి తీసుకెళ్లామని, మత్స్యకార కుటుంబాలు ధైర్యంగా ఉండాలని మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు కోరారు.

● కోస్టుగార్డుకు చిక్కిన వారిలో మరుపల్లి ప్రవీణ్‌కు ఇంకా వివాహం కాలేదు. వృద్ధులైన తల్లిదండ్రులు ఉన్నారు. మరుపల్లి రమేష్, చిన్నప్పన్న ఇద్దరు అన్నదమ్ములు. వీరిలో రమేష్‌కు ఇంకా వివాహం కాలేదు. చిన్నప్పన్నకు ముగ్గురు పిల్లలు, భార్య ఉన్నారు. సూరాడ అప్పలకొండకు వివాహమై ఏడాది అవుతోంది. సురపతి రాముకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వాసుపల్లి సీతయ్యకు భార్య ఎర్రమ్మ, ఇద్దరు పిల్లలు ఉండగా, నక్కా రమణకు భార్య ఎల్లయ్యమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మత్స్యకారులను తీసుకువచ్చేందుకు చర్యలు

● మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

శ్రీకాకుళం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి):బంగ్లాదేశ్ నౌకాదళం అధీనంలో ఉన్న విజయనగరానికి చెందిన 8 మంది మత్స్యకారులను స్వదేశానికి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఇప్పటికే భారత ప్రభుత్వం నుంచి విదేశీ మంత్రిత్వ శాఖ ద్వారా బంగ్లాదేశ్ ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి మత్స్యకారులను వెనక్కు తీసుకువచ్చేందుకు చర్యలు ప్రారంభించామన్నారు. మత్స్యకార కుటుంబాలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అధైర్య పడవద్దన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

కన్వర్షన్ లేదు సరే.. పర్మిషనో!

(ఐదో పేజీ తరువాయి)

కష్టమర్లకు నచ్చజెప్పేవారు. అయితే ల్యాండ్ కన్వర్షన్ కూడా రద్దు చేస్తూ ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయడంతో ఇక తమకు ఆ ఖర్చు కూడా లేదని, ఇతర అనుమతుల గురించి కష్టమర్లు పెద్దగా పట్టించుకోరని వ్యాపారులు ఎగిరి గంతేస్తున్నారు. ఆర్డీవో కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి లక్షల రూపాయలు వెచ్చిస్తే ల్యాండ్ కన్వర్షన్‌కు అనుమతి వచ్చేదని, ఇకపై ఆ ఖర్చు లేకుండానే తాము వ్యాపారం చేసుకోవచ్చునని వ్యాపారులు భావిస్తున్నారు. ఇప్పటికే మారుమూల గ్రామాల్లోని వ్యవసాయ భూముల్లో లే అవుట్లు తయారవుతున్నాయి.

● చీపురుపల్లి మండలంలోని చిననడిపల్లి పంచాయతీ పరిధిలో సర్వే నం.73, 92, 93, 94లలో ఓ వ్యాపారి 69 ఎకరాల్లో లే అవుట్ చేసి సగానికి పైగా విక్రయాలు పూర్తి చేశారు. ఈ లేఅవుట్‌కు ల్యాండ్ కన్వర్షన్ గాని, ఇతర అనుమతులు గాని తీసుకోలేదు. కనీసం పంచాయతీ అనుమతి కూడా లేకుండానే ఇక్కడ వ్యాపారం సాగిపోతోంది. రెండు జిల్లాను కలిపే చీపురుపల్లి, కమ్మసిగడాం రహదారికి ఆనుకొని 69 ఎకరాల్లో వ్యాపారం సాగుతున్నా, స్థానిక పంచాయతీ సిబ్బంది గాని, మండల స్థాయి అధికారులకు గాని తెలియక పోవడం విస్మయం కలిగించే విషయం. ఈ విషయంపై పెద్ద ఎత్తున ప్రచారం జరగడంతో స్పందించిన ఎంపీడీఓ ఐ.సురేష్, ఇతర సిబ్బంది లే అవుట్‌ను పరిశీలించి యజమానికి నోటీసులు జారీ చేశారు. అనధికార లే అవుట్‌గా గుర్తించి సంబంధిత స్థలంలో హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. ఈ విధంగా ల్యాండ్ కన్వర్షన్ విధానాన్ని ప్రభుత్వం రద్దు చేయడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో తయారవుతున్న లే అవుట్లను పసిగట్టడం తమకు కష్టంగా మారుతోందని అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

బినామీ మస్తర్లకు చెక్

(ఐదో పేజీ తరువాయి)

ప్రత్యేక యాప్ రూపొందించి వేతనదారుల ఫొటోలను అందులో అప్లోడ్ చేస్తున్నారు. ఇది ఒక విధంగా ముఖ ఆధారిత హాజరు వంటిది.

● ఇప్పటివరకు మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లదే ఇష్టారాజ్యం నడిచేది. దొంగమస్తర్లలో వీళ్లదే కీలక పాత్ర. ముల్లును ముల్లుతోనే తీయాలన్నట్టుగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పుడు ఈకేవైసీ బాధ్యతను వారికే అప్పగించింది. జాబ్ కార్డుల్లో ఉండే వేతనదారులకు విడివిడిగా ఫొటోలను తీసి వారి మొబైల్లో ప్రత్యేక యాప్‌లో నిక్షిప్తం చేయాల్సి ఉంటుంది. ముఖ హాజరు అమలు చేశాక ఒకరి తరపున మరొకరు హాజరు పడదు. పనికి రాకపోయినా హాజరు వేయాలంటే ఇక కుదరదు.

● ఇప్పటివరకు ఉదయం పనికి హాజరైనపుడు మొదటి దఫా ఫొటో తీసేవారు. 11 గంటలకు ఇంటికి వెళ్లినప్పుడు రెండో ఫొటో తీసి రెండో పూట పనికి హాజరైనట్లు మేనేజ్ చేసేవారు. ఇకపై రెండుపూటలా పనికి హాజరవ్వాల్సిందే. రెండోపూట డుమ్మా కొడితే తొలిపూట వేతనమే అందుతుంది.

నిలిచిన ఎన్టీఆర్ వైద్య సేవ

(ఐదో పేజీ తరువాయి)

హయాంలోనే ప్రారంభమైంది. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత బిల్లులను సర్దుబాటు చేసింది కానీ బకాయి భారీగా పెరిగిపోయింది. రూ.2700 కోట్లకుపైగా ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. వైసీపీ హయాంలో 2023 మేలో ఇదే విధంగా సేవల నిలిపివేతకు నెట్‌వర్క్ ఆస్పత్రులు నిర్ణయించగా ప్రభుత్వం హడావుడిగా ఆ నెలకు సంబంధించి రూ.200 బకాయిలు విడుదల చేసింది. సుమారు 2 వేల కోట్లు బకాయి ఉండేది. అదే పెండింగ్ కొనసాగుతూ రాగా కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత రూ.700 కోట్ల వరకూ బకాయిలను చెల్లించింది. అయితే మరింతగా పేరుకుపోతుండడంతో ప్రైవేటు ఆస్పత్రులు సేవలు నిలిపివేశాయి. దీనివల్ల పేద రోగులు చాలా ఇబ్బందులు పడుతున్నారు.

రోగులకు ఇబ్బందులు కలగనివ్వం

ఎన్టీఆర్ వైద్య సేవ అవసరమైన రోగులకు వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. అవసరమైతే 104 వాహనాల ద్వారా ప్రభుత్వ ఏరియా, సామాజిక ఆసుపత్రులకు తరలించేలా సహకారం అందిస్తున్నాం. ప్రభుత్వ వైద్యకళాశాలల్లో కూడా వైద్యసేవలు అందించేలా చొరవ తీసుకుంటున్నాం.

- దూబ రాంబాబు, జిల్లా కో ఆర్డినేటర్, ఎన్టీఆర్ వైద్య సేవ

భక్తులతో శివాలయాలు కిటకిట

బొబ్బిలి, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ప్రారంభమైన నేపథ్యంలో బుధవారం పట్టణంలోని పురాతనమైన జంగాల శివాలయం, దిబ్బవీధి శివాలయంతో పాటు పాతబొబ్బిలి, మల్లమ్మపేట, బంగారమ్మ గుడి, సంతోషిమాత ఆలయాల్లో శివలింగాలకు భక్తులు అభిషేకాలు చేశారు. దిబ్బవీధి శివాలయాన్ని మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి దర్శించుకున్నారు. పూల్‌బాగ్ రోడ్డులో గురుస్వామి కర్రోతు రాములప్పన్న ఆధ్వర్యంలో శివస్వాములు కార్తీక పూజలు, భజనలు చేశారు.

ఉపాధి పనులు వేగవంతం చేయండి

బొబ్బిలి రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనులు వేగవంతం చేయాలని ఏపీడీ రమామణి సిబ్బందిని ఆదేశించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రవికుమార్ అధ్యక్షతన క్షేత్ర సహాయకులు, సాంకేతిక సహాయకులతో ఆమె సమావేశమై పలు సూచనలు చేశారు

చుక్కనీరు ఇవ్వని బోర్లు

● ప్రజలకు తప్పని నీటి ఇక్కట్లు



ఎరకందొరవలసలో ఇలా..

బొబ్బిలి రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నీటి ఎద్దడి ఏర్పడకుండా బోరుబావులను ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపట్టాలనే ఆదేశాలను పట్టించుకునే నాథులే కరువయ్యారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా కొన్ని బోరుబావులు చుక్క నీరు విదల్చడం లేదు. గ్రామాల్లో నీటి అవసరాలకు ప్రజలు ఆధారపడేది బోరుబావులపైనే. మండలలోని విజయపురివలస, ఎరకందొరవలస, వెంకటరాయుడిపేట, రంగరాయపురం, అలజంగి, పిరిడి, కోయకొండవలస తదితర గ్రామాల్లో కొన్ని నెలలుగా బోరుబావులు పాడయ్యాయి. దాంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. బోరుబావులకు మరమ్మతులు చేయించాలని పలుమార్లు సచివాలయంలో ఫిర్యాదులు చేసినా అధికారులు స్పందించడం లేదనేది వారి మాట. మరమ్మతులు సకాలంలో చేయకపోవడం అవి తప్పు పట్టి పాడవుతున్నాయని వారంటున్నారు.



విజయపురివలసలో...

● ఈ విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విశ్వతేజ వివరణ కోరగా తమకు ఎవరూ ఫిర్యాదు చేయలేదన్నారు. ఎంపీడీవో తెలియజేస్తే తప్ప మేమేమీ చేయలేమన్నారు.

అన్నసమారాధన ప్రారంభం



వడ్డిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి): స్థానిక చినబజారు జంక్షన్‌లోని రామమందిరంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని బుధవారం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కళింగవైశ్య సంఘం అధ్యక్షుడు గెంబలి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తొలిరోజు ఎమ్మెల్యే బేబీనాయన, మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్‌బాబు చేతుల మీదుగా అన్న సమారాధనకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమాన్ని ఏడాది పొడవునా కొనసాగించాలని నిర్ణయించినట్టు గెంబలి తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బరాటం గిరి, శ్రీనివాసరావు హరినాథ్, జేసీహెచ్ నారాయణమూర్తి, శంకా గౌరీపతి పాల్గొన్నారు.

గర్భకోశ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

రామభద్రపురం, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి): గర్భకోశ వ్యాధులపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని పశుగణాభివృద్ధి సంస్థ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జి.రాధాకృష్ణ కోరారు. నాయుడువలసలో బుధవారం ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదికి ఒక దూడ పుట్టాలనే లక్ష్యంతో పశు గణాభివృద్ధి సంస్థ పనిచేస్తోందన్నారు. సకాలంలో గర్భకోశ వ్యాధులను గుర్తించి నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు పశుగణా భివృద్ధి సంస్థ ద్వారా 16 గర్భకోశ వ్యాధుల శిబిరాలు నిర్వహించామన్నారు. ఎదను గుర్తించకపోవడం, అండాశయంలో వ్యాధులను నయం చేయడానికి ఈ శిబిరం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వ్యాధి నిర్ధారణ ప్రయోగశాల ప్రతినిధి డాక్టర్ హిమజా మాట్లాడుతూ పశువు ఆరోగ్యంగా ఉంటేనే పాల దిగుబడి వస్తుందన్నారు. అనంతరం రైతులకు మినరల్ మిక్చర్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ ఏడీ విష్ణు, పశు వైద్యాధికారులు ఎ.అప్పలనాయుడు, సురేష్, భాగ్యరాజు, జగన్, సర్పంచ్ నడిమింటి లక్ష్మి పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి ప్రాధాన్యం



మాట్లాడుతున్న రెడ్డి రామ్మూర్తినాయుడు

రామభద్రపురం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గ్రంథాలయాలను అభివృద్ధి చేయడానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఏపీ గ్రంథాలయ పరిషత్ సభ్యుడు రెడ్డి రామ్మూర్తినాయుడు తెలిపారు. మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గ్రంథాలయాల్లో ప్రధాన సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. నూతన భవనాల నిర్మాణానికి, సిబ్బంది నియామకానికి, జీరో అకౌంట్ ద్వారా సిబ్బందికి జీతాలు, గ్రంథాలయాల్లో పోటీ పరీక్షల పుస్తకాల కొనుగోలుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చొరవ తీసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ కార్యదర్శి బి.లక్ష్మి, స్థానిక గ్రంథ పాలకురాలు బి.సత్యవాణి, బాడంగి గ్రంథపాలకుడు దుర్గాప్రసాద్, జిల్లా గ్రంథాలయ సిబ్బంది ప్రతినిధి ఫణి పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ శిబిరాలు

బొబ్బిలి రూరల్, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఈ నెల 23 నుంచి 30 వరకు ప్రత్యేక ఆధార్ శిబిరాలను నిర్వహిస్తామని ఎంపీడీవో రవికుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. కోమటిపల్లి, పారాది, చింతాడ, పెంట గ్రామాల్లోని ఉన్నత పాఠశాలల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల శిబారాలను నిర్వహిస్తామన్నారు. ఆధార్ నమోదు, అప్‌డేషన్లను ఆయా పంచాయతీల కార్యదర్శులు పర్యవేక్షించనున్నారన్నారు.

రైతుకు రూ.20 వేల ఆర్థిక సాయం

తెర్లాం, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పిడుగుపాటుకు బొంగుపేటలో ఎం.ఆదినారాయణకు చెందిన ఆవు మృతి చెందిన నేపథ్యంలో బుధవారం సంబంధిత రైతుకు ఎమ్మెల్యే బేబీనాయన రూ.20 వేలు ఆర్థిక సాయం చేశారు. ఆయనతో పాటు టీడీపీ నాయకుడు వెంకటేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ వెంకటనాయుడు, కరణం రమేశ్ తదితరులుఉన్నారు.

సాంకేతిక సహాయకులతో సమీక్ష

బాడంగి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సాంకేతిక సహాయకులతో బుధవారం ఎంపీడీవో ఎస్.రామకృష్ణ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ-సర్వీస్ నగదును సకాలంలో బ్యాంకులో డిపాజిట్ చేయాలని ఆదేశించారు. ఆధార్ ప్రత్యేక శిబిరాలను గురువారం నుంచి ప్రాంభించనున్న నేపథ్యంలో అందరూ అందుబాటులో ఉండాలన్నారు. వాడాడ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ నెల 23, 24, 25 తేదీల్లో ఆధార్ శిబిరం ఏర్పాటు చేయనున్నామన్నారు. అనంతరం 27, 28, 29, 30 తేదీల్లో రేజేలు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆధార్ శిబిరం ఏర్పాటు చేస్తామన్నారు.

సామాజిక మాధ్యమాలతో జాగ్రత్త

రామభద్రపురం, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు సామాజిక మాధ్యమాలతో అప్రమత్తంగా ఉండాలని బొబ్బిలి రూరల్ సీఐ కె.నారాయణరావు హెచ్చరించారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా బుధవారం బూసాయవలసలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో మాట్లాడారు. సామాజిక మాధ్యమాలతో కలిగే నష్టాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సైబర్ నేరాలు, డ్రగ్స్ వినియోగం, శక్తియాప్‌లపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీసు అమరవీరుల వారోత్సవాలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ వెలమల ప్రసాదరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో పాము హల్‌చల్

బొబ్బిలి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి):పట్టణంలోని పాతబస్టాండ్ సమీపంలోని డాక్టర్ రెడ్డి సత్యారావు ఆసుపత్రిలోని ఎక్స్‌రే రూమ్‌లోకి బుధవారం ఓ పాము చొరబడి హల్‌చల్ చేసింది. సిబ్బంది భయాందోళనలకు గురయ్యారు. వెంటనే ఓ పెద్దాయన చొరవ తీసుకుని ఆ పామును పట్టుకున్నాడు. పట్టణానికి దూరంగా తీసుకెళ్లి వదిలేశారు. పాము సుమారు ఆరు అడుగుల పొడవు ఉంది. పామును అక్కడి నుంచి తరలించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

విద్యార్థులకు ఇండస్ట్రియల్ టూర్

బాడంగి, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 9, 10వ తరగతి విద్యార్థులను బుధవారం ఇండస్ట్రియల్ టూర్‌కు ఉపాధ్యాయులు తీసుకెళ్లారు. రిటైల్ విభాగంలో విద్యార్థులు రామభద్రపురంలోని విశాఖ డెయిరీ, రిలయన్స్ మార్ట్‌లో మార్కెటింగ్ విధానాలు, కస్టమర్ సర్వీస్, జీఎస్టీ, బిల్లింగ్ సిస్టమ్‌పై విద్యార్థులకు ప్రత్యక్ష అవగాహన కల్పించారు. ఎలక్ట్రానిక్స్ విభాగంలో విద్యుత్ పరికరాల అసెంబ్లింగ్ సర్క్యూట్ డిజైన్, రిపేరు, మెయింటెనెన్స్, ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్‌లో పవర్ సప్లై అంశాలను వారు పరిశీలించారు. టూర్‌లో హెచ్‌ఎం దత్తి సత్యనారాయణ, టీచర్లు కె.వెంకటరమణ, జి.దినేష్, షేక్ హసీనా, కొల్లి ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా నందన్న ఉత్సవాలు



కొలువుదీరిన నందన్న

రామభద్రపురం, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి): ఆరికతోటలో నందన్న ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఏటా దీపావళి అమావాస్య అనంతరం నందమ్మను గ్రామంలో నెలకొల్పి రోజూ పూజలు నిర్వహించడం ఆనవాయితీ. నాగుల చవితి సాయంత్రం శివపార్వతులతో కూడిన నందన్నను గ్రామంలో ఊరేగించి నిమజ్జనం చేయనున్నారు. అదేరోజు పెద్దఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు.